సందడే సందడి



ఉపమాక తీర్థంలో జనం సందడి



దేవవరంలో తోడపెద్దుకు పూజలు చేసి సత్కరిస్తున్న భక్తులు



మాసాహేబుపేటలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు



వెంకటాపురంలో బహుమతులు అందిస్తున్న సర్పంచ్ సత్యం



నక్కపల్లి: సంక్రాంతి, కనుమ **పండగలను ప్రజలు** మంగళ, బుధవారాలలో **అత్యంత ఘనంగా జరు**పుకొన్నారు. పల్లెలో సందడి **వాతావరణం నెలకొం**ది. కొత్త అల్లుళ్లు, బంధువుల **రాకతో ఇళ్లన్నీ కళకళ**లాడాయి. పిండివంటల ఘు**మఘుమలు, నూతన** వస్త్రాలు ధరించిన చిన్నారు**లు, యువత, కుర్ర**కారు ఆటపాటలతో మునిగి **తేలారు. సింహాద్రి** అప్పన్నకు ప్రతిరూపంగా **కొలిచే తోడ పెద్దుకు** ప్రత్యేక పూజలు నిర్వహించా**రు. పసుపు, కుం**కుమ, కానుకలు ఇచ్చి స**త్కరించారు. సినిమా** హాళ్లు కూడా ప్రేక్షకులతో **రద్దీగా కనిపించాయి.** కోడి పందేలు కూడా పెద్ద ఎ**త్తున జరిగాయి. హరి**దాసులు, గంగిరెద్దుల వారి **సందడి గ్రామాల్లో** విశేషంగా జరిగాయి. ప్రతి గ్రామంలో పేకాట జోరుగా సాగింది.

ప్రారంభమైన తీర్థాలు

సంక్రాంతి సమయంలో పెద్దగా చెప్పుకునేవి తీర్థాలు(తిరునాళ్లు). సంక్రాంతి మొదలుకుని 15 రోజుల పాటు పలు చోట్ల తిరునాళ్లు పెద్ద ఎత్తున జరుగుతాయి. ఆయా గ్రామాల్లో జరిగే తిరునాళ్లకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరవుతారు. ముఖ్యంగా నక్కపల్లి, ఒడ్డిమెట్ట, నామవరం, గొడిచర్ల, చినదొడ్డిగల్లు తదితర ప్రాంతాల్లో తీర్థాలు ప్రతి ఏటా ఘనంగా జరుగుతాయి. తోడపెద్దు భజనలు, తప్పెటగుళ్లు, కోలాటాల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. కనుమ నాడు ఒడ్డిమెట్ట, ఉపమాకలో జరిగిన తిరునాళ్లకు జనం పోటెత్తారు. పలు గ్రామాల్లో జరిగిన ముగ్గుల పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రతిభ కనబరిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

మాసాహేబుపేటలో ముగ్గుల పోటీలు

పాయకరావుపేట మండలంలోని మాసాహేబుపేట గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి గెలుపొందిన తోట దీక్షితకు వెండి గ్లాసు, ద్వితీయ బహుమతి గెలుపొందిన తిరంశెట్టి విజయదుర్గకు డిన్నర్‌సెట్, తృతీయ బహుమతి సాధించిన కూండ్రపు ప్రజ్ఞకు డిన్నర్ సెట్ అందజేశారు. 27 మంది మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. గ్రామంలో గతేడాది జరిగిన పదో తరగతి పరీక్షలో ప్రతిభ కనబరిచి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన కడిమి నాగచైతన్యకు రూ.5 వేలు సాయం అందించారు.

ఎస్.రాయవరం: మండలంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఎస్.రాయవరంలో జరిగిన తీర్థంలో చిన్నారులు, యువకులు సందడి చేశారు. వెంకటాపురం, వేమగిరి, బంగారమ్మపాలెం గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మంగళవారం గ్రామాల్లో తోడ పెద్దు ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. బుధవారం అన్నదాతలు పాడి పశువులకు, వాహన పూజలు చేసి ప్రసాదాలు ఆహారంగా తినిపించారు. పిట్ల పాలెంలో తీర్థం కనుల పండువగా జరిగింది.

మునగపాక: కనుమ పండగ సందర్భంగా పలు గ్రామాల్లో బుధవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, సోదరుడు నూకరాజు తన తల్లి అచ్చియమ్మ జ్ఞాపకార్థం సాయిబాబా ఆలయ ప్రాంగణంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మునగపాకలో వేగి నూకన్న, సీతయమ్మ దంపతుల జ్ఞాపకార్థం వేగి పరదేశినాయుడు, వేగి లక్ష్మణరావు, వెంకటరమణ బాబు, బోష్ పేదలకు దుప్పట్లు అందజేశారు. నాగులాపల్లిలో గొబ్బూరు రామునాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు మళ్ల కాలేశ్వరరావు పేదలకు దుప్పట్లు అందజేశారు.

పాయకరావుపేట: సంక్రాంతి సంబరాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు. మండలంలోని సత్యవరం గ్రామంలో బుధవారం జరిగిన ముగ్గుల పోటీలను ఆయన తిలకించారు. 30 మంది మహిళలు ఈ పోటీల్లో పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.



మునగపాక బైపాస్ రోడ్డులో పరుగు తీస్తున్న ఎడ్ల బండి

జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీల విజేత కూండ్రం

మునగపాక: గ్రామీణ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కోరారు. మునగపాక బైపాస్ రోడ్డులో సంక్రాంతి సంబరాల్లో భాగంగా మునగపాక గ్రామ రైతు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలను మంగళవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. ఈ పోటీల్లో కూండ్రంకు చెందిన మరిడిమాంబ ఎడ్ల బండికి ప్రథమ స్థానం దక్కింది. నర్సాపురానికి చెందిన సంపత్ వినాయక బండికి ద్వితీయ స్థానం, దేవరాపల్లికి చెందిన శ్రీలక్ష్మీనరసింహ ఎడ్ల బండికి తృతీయ, దేవరాపల్లికి చెందిన హేతన్స్ నాయుడు బండికి నాలుగో స్థానం, నీలకంఠాపురానికి చెందిన ఎడ్ల బండికి ఐదో స్థానం లభించాయి. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

కోటవురట్ల: సంక్రాంతి, కనుమ పండగలను ఘనంగా జరుపుకొన్నారు. బంధుమిత్రుల రాకతో పల్లెలు సందడిగా మారిపోయాయి. కొత్తల్లుళ్లు, కుర్రకారు సరదాలు, భావా మరదళ్ల వెటకారాలు, పెద్దవాళ్ల ఆత్మీయానురాగాలతో ఎటు చూసినా కోలాహలమే. ఈ సందర్భంగా పలు గ్రామాలలో ముగ్గుల పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కోటవురట్ల, కె.వెంకటాపురం, తంగేడు, జల్లూరు తదితర గ్రామాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కె.వెంకటాపురంలో తోడపెద్దు ఉత్సవం చేసి గ్రామంలో ఊరేగించారు. ముగ్గుల పోటీలో విజేతలకు వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైల రమేష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కోటవురట్లలో కనుమ సంబరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కిడ్స్ ఫ్యాషన్ షో విశేషంగా ఆకట్టుకోగా మహిళల మ్యూజికల్ చైర్ కనువిందు చేశాయి. ఇక్కడ ముగ్గుల పోటీలో జవ్వాది కుమారి ప్రథమ బహుమతి సాధించింది. యువకులు సాంస్కృతిక కార్యక్రమాలను ఆకట్టుకునేలా నిర్వహించారు.

అచ్యుతాపురం: మండలంలోని సంక్రాంతి సందడితో పల్లెలు కళకళలాడాయి. పలు గ్రామాల్లో గాలి పతంగుల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అచ్యుతాపురంలోని పారిశుధ్య సిబ్బందికి సర్పంచ్ భర్త కూండ్రపు విమలనాయుడు దుస్తులు పంపిణీ చేశారు. పలు గ్రామాల్లో తీర్థాలు జరిగాయి.



కె.వెంకటాపురంలో విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు రమేష్



కోటవురట్లలో ప్రథమ బహుమతి పొందిన ముగ్గు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మునగపాక సర్పంచ్ అప్పారావు



అచ్యుతాపురంలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందిస్తున్న కూండ్రపు విమలనాయుడు



కిడ్స్ ఫ్యాషన్ షోలో పాల్గొన్న చిన్నారులు



మునగపాకలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న వేగి పరదేశినాయుడు, లక్ష్మణరావు, తదితరులు



ఎస్.రాయవరం తీర్థంలో సందడి



సత్యవరం ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ఎంపీ సీఎం రమేష్

క్లుప్తంగా

ఘనంగా అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపు



మునగపాకలో అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

మునగపాక: సంక్రాంతి పర్వదినం సందర్భంగా మునగపాకలో అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని మంగళవారం ఘనంగా ఊరేగించారు. ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు అన్ని వీధుల గుండా సాగి తిరిగి ఆలయానికి చేరుకుంది. కోలాటం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. పలువురు భక్తులు అయ్యప్పను దర్శించుకున్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు సూర్యనారాయణకు నివాళి



విశ్రాంత ఉపాధ్యాయుడు సూర్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: మునగపాకలో బుధవారం విశ్రాంత ఉపాధ్యాయుడు వెలగా సూర్యనారాయణ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు, సర్పంచ్ దిమ్మల అప్పారావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆడారి కాశీబాబు, బొడ్డేడ అప్పలనాయుడు, దాడి ముసిలినాయుడు, సూర్యనారాయణ మాష్టారు కుమారులు నరసింగరావు, జగన్నాథరావు, వెంకటేష్, సురేష్‌కుమార్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా గుర్రపు స్వారీ పోటీలు



సోమలింగపాలెంలో గుర్రపు స్వారీని ఆసక్తిగా చూస్తున్న జనం

యలమంచిలి రూరల్: సోమలింగపాలెంలో బుధవారం రాజరాజేశ్వరీ సోమేశ్వరస్వామి తీర్థ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గుర్రపు స్వారీ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. గ్రామ శివార్లలో పంట పొలాల్లో ఉమ్మడి జిల్లాతో పాటు చుట్టు పక్కల జిల్లాల నుంచి వచ్చిన 15 గుర్రాలను శిక్షణ పొందిన యువకులు స్వారీ చేస్తూ పరుగులు పెట్టించారు. గుర్రపు పరుగు పందేలను చూసేందుకు భారీగా యువకులు చుట్టు పక్కల గ్రామాల నుంచి తరలివచ్చారు. మొదటి బహుమతి దక్కించుకున్న యల్లపు జగదీష్‌తో పాటు ద్వితీయ, తృతీయ విజేతలకు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ బహుమతులు అందజేశారు. మహిళల కోలాట ప్రదర్శనలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కర్రి ఝాన్సీ, యల్లపు గోపీ, కర్రి స్వామి, పాలమరశెట్టి విశ్వేశ్వరరావు, పిల్లా రమేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు ఉత్సవం



ఉరుసు ఉత్సవం నిర్వహిస్తున్న ముస్లింలు

నక్కపల్లి: రామకృష్ణాపురంలో బుధవారం ఖ్వాజా గరీబ్ నవాజ్ ఉరుసు ఉత్సవం ఘనంగా జరిగింది. గ్రామ జమాత్ కమిటీ ఆధ్వర్యంలో ఖ్వాజా గరీబ్ నవాజ్ నిషానీ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఉరుసు ఉత్సవాన్ని తొలిసారిగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం దివ్య ఖురాన్ పఠనం, ఖ్వాజా గరీబ్ నవాజ్ సందల్ (చందన) ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా పలువురు మత గురువులు మాట్లాడుతూ ఖ్వాజా గరీబ్ నవాజ్ సూచించిన మార్గాన్ని అనుసరించి, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, గరీబ్ నవాజ్ వారి జెండాను ఆవిష్కరించారు. ప్రసాదాన్ని పంపిణీ చేశారు. విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉత్సవంలో హైదర్ అలి సింకా, కొప్పిశెట్టి వెంకటేష్, ముస్సీసా, ఎస్కే కాలేషా, అధిక సంఖ్యలో ముస్లింలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సేవా భావం ఉండాలి



కైలాసపట్నంలో నిత్యావసర సరకులు అందజేస్తున్న జెడ్పీటీసీ ఉమాదేవి

కోటవురట్ల: ప్రతి ఒక్కరికీ సేవా గుణం ఉండాలని జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి కోరారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని విశాఖకు చెందిన లలిత ప్లాస్టిక్స్ అధినేత శాంతిలాల్ పుగాలియా, లలిత పుగాలియా దంపతులు కై లాసపట్నంలో ప్రతి ఏటా మాదిరిగా 30 మంది నిరుపేదలకు బియ్యం, కందిపప్పు, ఆయిల్, పంచదార, కూరగాయలు, స్వీట్ బాక్సులను జెడ్పీటీసీ ఉమాదేవి చేతుల మీదుగా అందజేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ శ్రీమరిడిమాంబ వర్తక సేవా సంఘం అధ్యక్షుడు తుమ్మలపల్లి ఆంజనేయులు ప్రోత్సాహంతో అతని స్నేహితుడు శాంతిలాల్ పుగాలియా సేవా కార్యక్రమాలకు కోటవురట్ల మండలాన్ని ఎంపిక చేసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సిద్ధాబత్తుల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, కోటవురట్ల వార్డు మెంబరు టి.బాబూరావు, స్వామినాథ్, స్థానికులు పాల్గొన్నారు.

కోడి పందేల్లో సీఎం రమేష్

నక్కపల్లి: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోను సంక్రాంతిని పురస్కరించుకుని కోడిపందేలు జోరుగా జరిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉభయ గోదావరి జిల్లాల్లో నిర్వహించే విధంగా ఇక్కడ పందేలను ఏర్పాటు చేశారు. పాయకరావుపేట, నక్కపల్లి మండలం వేంపాడు, కోటవురట్ల, ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు, తిమ్మాపురం, ఎస్.రాయవరం తదితర ప్రాంతాల్లో పందేలు నిర్వహించారు. బుధవారం వేంపాడులో జరిగిన కోడి పందేల్లో అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఎంపీ రమేష్ తన కుటుంబ సభ్యులు, స్థానిక కూటమి నాయకులతో కలిసి పందేల్లో పాల్గొని కోడిపుంజులను పట్టుకుని పోట్లాటకు ఉసిగొల్పారు. చుట్టు పక్కల మండలాలతోపాటు విశాఖ నగరం నుంచి కూడా తరలివచ్చి పోటీలు తిలకించారు. దరిదాపుల్లోకి వెళ్లవద్దని పోలీసు అధికారులకు మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు చెప్పుకుంటున్నారు.

లక్ష్యంతో చదివితే మంచి ఫలితాలు



పదిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కారం

మునగపాక: విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్ అన్నారు. గతేడాది పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మండలంలోని పాటిపల్లిలో మా ఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి మా ఊళ్లో గ్రంథాలయం అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థులు కూడా లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడి, ఇష్టపడి చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆడారి గోవింద్, మొల్లేటి సత్యనారాయణ, భీశెట్టి ధనశ్రీను, సంజీవ్, గ్రంథాలయ డైరెక్టర్లు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి



మునగపాకలో ముగ్గులు వేస్తున్న మహిళలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. మునగపాక పల్లపు వీధి ప్రజలు, మాజీ వార్డు సభ్యులు ఆడారి కాశీబాబు నేతృత్వంలో కనుమ పండగ సందర్భంగా బుధవారం రాత్రి తులసీ కల్యాణ మండపం ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బొడ్డేడ మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా తమలో ఉన్న ప్రతిభను వెలికితీసుకునే అవకాశం ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పెద్దలు సూరిశెట్టి కన్నారావు, సూరిశెట్టి సుధారాణి, దొడ్డి అప్పలనాయుడు, సూరిశెట్టి అప్పలనాయుడు, పొలిమేర కృష్ణ, కోనపల్లి రామ్మోహనరావు, వేగి కృష్ణ, వెలగా రామకృష్ణ, కాండ్రేగుల జగ్గారావు, సర్పంచ్ దిమ్మల అప్పారావు తదితరులు పాల్గొన్నారు. మహిళలు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి.

గడ్డి వాము దగ్ధం



తారువలో దగ్ధమైన గడ్డివాము

దేవరాపల్లి: మండలంలోని తారువలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డి వాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన బూడి మర్లతల్లినాయుడు కల్లంలో ఈ ప్రమాదం జరిగింది. మర్లమాంబ తీర్థం జరుగుతుండడంతో అక్కడే ఉన్న స్థానికులు వెంటనే మంటలను ఆర్పేందుకు యత్నించారు. ఈ లోగా చోడవరం అగ్నిమాపక శకటం సిబ్బంది చేరుకొని మంటలను పూర్తిగా అదుపు చేశారు.

రాంబిల్లిలో వెయ్యి మందికి దుస్తుల పంపిణీ



రాంబిల్లిలో పేదలకు దుస్తులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు

రాంబిల్లి(యలమంచిలి): సంక్రాంతి సందర్భంగా రాంబిల్లిలో మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు తన మామ పిన్నమరాజు సత్యనారాయణరాజు జ్ఞాపకార్థం మంగళవారం 1000 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కన్నబాబురాజు స్వగృహంలో పేదలకు, వృద్ధులకు చీరలు, దుప్పట్లను ఆయన కుటుంబ సభ్యులతో కలసి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాంబిల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనుబాబు, కిశోర్‌రాజు, వర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

16 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

రాంబిల్లి(యలమంచిలి): పేకాట ఆడుతున్న 16 మందిని అరెస్టు చేసినట్లు రాంబిల్లి ఎస్‌ఐ నాగేంద్ర సోమవారం రాత్రి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాంబిల్లి మండలంలో దిమిలి, మామిడివాడ, వెల్చూరు గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై పోలీసులు దాడి చేశారు. ఆయా గ్రామాల్లో 16 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.10 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

18న వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల వేడుక

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో పట్టణంలో కుంచావారి, వేల్పులవీధి, గవరపాలెం గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీ సీఎం.రమేష్ అన్నారు. స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారిని బుధవారం సాయంత్రం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 18న వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆలయ చైర్మన్ వాకాడ బాబు ఎంపీని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఆలయ కార్యదర్శి మద్దాల నూకరాజు, కోశాధికారి వేల్పుల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం



కొత్తపాలెంలో కోలాటం ఆడుతున్న మహిళలు

యలమంచిలి రూరల్: కొత్తపాలెంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన తీర్థ మహోత్సవం వైభవంగా జరిగింది. గ్రామ ఆర్‌ఎస్ఎస్ జిల్లా నాయకుడు ఆడారి వెంకట రెడ్డి నాయుడు తండ్రి సత్యంనాయుడు జ్ఞాపకార్థం గ్రామంలో శివాలయం వద్ద నిర్వహించిన ఈ తీర్థంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన కోలాట ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వాటిని అందరూ ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యుడు రాపేటి సంతోష్, ఆడారి భాస్కర్రావు, ఆదిబాబు, పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.